క్లుప్తంగా

రణదివే స్ఫూర్తితో పోరాడాలి



నెహ్రూసెంటర్: స్వాతంత్రోద్యమ, ట్రేడ్ యూనియన్ నాయకురాలు విమల రణదివే పోరాట స్ఫూర్తితో శ్రామిక మహిళలు తమ హక్కుల సాధన కోసం ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. విమల రణదివే జయంతి వారోత్సవాల్లో భాగంగా సంఘ కార్యాలయంలో శనివారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా కుంట ఉపేందర్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ చింత మౌనిక మాట్లాడుతూ.. విమల రణదివే పన్నేండేళ్ల వయస్సులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపారని తెలిపారు. జనాభాలో సగభాగం ఉన్న మహిళలు జీతంలేని సేవా, సంరక్షణ పనులు చేస్తున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల శ్రమకు తగిన గుర్తింపు ఇవ్వాలని, పురుషులతో సమానంగా వేతనాలు చెల్లించాలన్నారు. హక్కుల పరిరక్షణకు శ్రామిక మహిళలు ఐక్యంగా పోరాటాలు నిర్వహించినప్పుడే విమల రణదివేకు అర్పించే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు సమ్మెట రాజమౌళి, వెలిశాల సుధాకర్, నీలం కృష్ణవేణి, స్నేహబిందు, కొత్త రజిని, గుగులోత్ ఝాన్సీ పాల్గొన్నారు.

చీరల పంపిణీ



మహబూబాబాద్ రూరల్: వాసవి క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు పాలకుర్తి గాయత్రీ పెళ్లిరోజు సందర్భంగా జిల్లా కేంద్రంలో మహిళలకు శనివారం చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఈగ శ్రీనివాస్, కార్యదర్శి జంగాల సదా, కోశాధికారి మాలె నవీన్, క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ యోగేశ్వర్ రావు పాల్గొన్నారు.

రూ.50వేల విరాళం అందజేత



గార్ల: మండలంలోని మర్రిగూడెం వేట వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న కల్యాణ మండపానికి గ్రామానికి చెందిన దాత అజ్మీర ప్రతాప్‌సింగ్ రూ.50వేల విరాళం అందజేశాడు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అమర్‌చంద్, సర్పంచ్ భూక్యా బుజ్జి రాములు, అర్చకులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

గార్ల: యాదాద్రి జిల్లా ఆలేరులో ఈనెల 25నుంచి 27వరకు నిర్వహించే ఏఐకేఎంఎస్ రాష్ట్ర 2వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం మద్దివంచ గ్రామంలో మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు భద్రయ్య, మల్లేశం, చంద్రయ్య, రాంబాబు, వెంకన్న, రోశయ్య, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

దళితరత్న అవార్డు ప్రదానం



కేసముద్రం: ఇనుగుర్తి సర్పంచ్ దార్ల రామ్మూర్తి రాష్ట్రస్థాయి దళిత రత్న అవార్డుకు ఎంపిక య్యాడు. ఈ మేరకు అంబేడ్కర్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి స్టేడియంలో ఉత్సవాల కమిటీ చైర్మన్ మేడి పాపయ్య, జంగా శ్రీనివాస్ చేతుల మీదుగా అందుకున్నారు.

రేపు వాహనాల వేలం

తొర్రూరు: గుడుంబా సంబంధిత కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 17 సోమవారం వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ బూస అశోక్ తెలిపారు. ఉదయం 11గంటలకు స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో 26 వాహనాలకు వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని, ఇతర వివరాలకు 94409 02662 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

శ్రవణ నక్షత్ర అభిషేకాలు

మహబూబాబాద్ రూరల్ : శ్రీవారి జన్మనక్షత్రమైన శ్రవణ నక్షత్రం రోజు సందర్భంగా జిల్లా కేంద్రంలోని శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవాలయంలో శనివారం శ్రీవేంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

బియ్యం అందజేత

కేసముద్రం: కేసముద్రంవిలేజీకి చెందిన గుండు కొమురమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. ఈ మేరకు శనివారం మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మేకల వీరన్నయాదవ్ క్వింటా బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో లచ్చమ్మ, రాంబాబు, అశోక్ పాల్గొన్నారు.

వేతన వెతలు..

- మున్సిపాలిటీ కాంట్రాక్ట్ సిబ్బందికి 4నెలలుగా అందని జీతాలు
- అప్పు చేసి కుటుంబాలను సాకుతున్న వైనం



విధుల్లో కాంట్రాక్ట్ కార్మికులు

డోర్నకల్: జిల్లాకు సీఎం వచ్చారు.. డోర్నకల్ మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.25 కోట్ల నిధులు కేటాయించారు. మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు వార్డులో పర్యటించి చేపట్టాల్సిన పనుల జాబితాను సిద్ధం చేశారు. ఎమ్మెల్యే వచ్చారు.. మున్సిపల్ కార్యాలయంలో అభివృద్ధి పనుల ప్రతిపాదనలపై కౌన్సిలర్లతో చర్చించారు. అడిషనల్ కలెక్టర్ వచ్చారు.. అభివృద్ధి పనులు చేపట్టాల్సిన ప్రదేశాలను పరిశీలించి, పనులపై కార్యాలయంలో కౌన్సిలర్లతో చర్చించారు. ఇదంతా గత కొద్ది రోజులుగా మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న తంతు. మున్సిపాలిటీ పరిధిలో పని చేస్తున్న సుమారు 40మంది సిబ్బంది మూడు నెలలుగా వేతనాలందక ఎదుర్కొంటున్న ఇబ్బందులు ఈ వ్యవహారంలో ఎక్కడా చర్చకు రాలేదు. తమ వార్డులలో పనులకు తమ పనులకు సిబ్బందిని వాడుకునే మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు సిబ్బంది బాధలను పట్టించుకున్న దాఖలాలు లేవు.

4 నెలలుగా అందని వేతనాలు..

నెలనెలా వేతనాలు రావు. సబ్బులు, నూనెలు, యూనిఫాం, బూట్లు, పనిముట్లు ఇవ్వరు. సెలవులు లేవు. వీధులు శుభ్రపర్చాలి, మురుగు కాల్వలో బురద, వ్యర్థాలను తొలగించాలి. ఇలాంటి విధులన్నీ సక్రమంగా చేస్తున్నా కాంట్రాక్ట్ సిబ్బంది వేతనాలు అందక అప్పులు చేస్తూ రేషన్ బియ్యం తింటూ దీనస్థితిలో జీవనం కొనసాగిస్తున్నారు. డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో 40మంది కాంటాక్ట్ పద్దతిలో రెండు దశాబ్దాలకు పైగా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి నెలనెలా జనరల్ ఫండ్ నుంచి వేతనాలు చెల్లించాల్సి ఉంది. జనరల్ ఫండ్ నుంచే కాంట్రాక్ట్ సిబ్బంది వేతనాలతోపాటు విద్యుత్ బిల్లులు, వాహనాల డీజిల్ ఇతర చెల్లింపులు ఉండటం, జనరల్ ఫండ్ నెలనెలా జమ కావాల్సిన ఆదాయం లక్ష్యం మేరకు జమ కాకపోవడంతో సిబ్బంది జీతాలు నెలనెలా చెల్లించడం లేదు. జనరల్ ఫండ్ తోపాటు పట్టణ ప్రగతి నిధుల నుంచి వేతనాలు చెల్లించే అవకాశాలు ఉన్నా ఇందుకోసం కలెక్టర్ అనుమతి తీసుకోవాల్సి ఉంది. దీంతో కాంట్రాక్ట్ సిబ్బందికి మూడు నెలలకోసారి, నాలుగు నెలలకోసారి ఒకనెల, రెండు నెలల వేతనాలు చెల్లిస్తున్నారు. ప్రస్తుతం కాంట్రాక్ట్ సిబ్బందికి జనవరి నెల నుంచి వేతనాలు అందలేదు. అధికారులు స్పందించి కాంటాక్ట్ సిబ్బందికి వేతనాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

జీతం వడ్డీ చెల్లింపునకే...



రెండు, మూడు నెలలకోసారి వచ్చే అరకొరజీతం వడ్డీల చెల్లింపునకే సరిపోతుంది. రేషన్‌బియ్యంతోపాటు అరకొర కూరలు, అప్పులతో రోజులు వెళ్లదీస్తున్నాం. నెలనెలా వేతనాలు అందకపోవడంతో కుటుంబ పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. నెలనెల వేతనాలు అందించాలి.

– నాగశేషు, పారిశుద్ధ్య కార్మికుడు, డోర్నకల్

17నుంచి విద్యుత్ ఉద్యోగుల సమ్మె



సమ్మె పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

నెహ్రూసెంటర్: ఈనెల 17నుంచి విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మె నిర్వహిస్తున్నామని, సమ్మెకు విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీఎస్‌పీఈ) మహబూబాబాద్ జిల్లా కన్వీనర్ బి.కిషోర్ పిలుపునిచ్చారు. టీఎస్‌పీఈ జేఏసీ సమావేశంలో జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బి.కిషోర్ మాట్లాడుతూ.. వేతన సవరణ–2022, ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్, ఆర్టిజన్ల, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమ్మెలో ప్రతి విద్యుత్ కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా చైర్మన్ కె.సాంబమూర్తి, కోకన్వీనర్లు బి.వెంకటేశ్వర్లు, 327 యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, ఆవుల శ్రీనివాస్, రవిశేఖర్, శ్రీనివాస్, సాగర్, ఆరీఫ్, ఎన్.సుధాకర్, సుమన్ పాల్గొన్నారు.

గార్ల: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ శాఖ ఉద్యోగులపై ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని విద్యుత్ ఉద్యోగుల సంఘం మహబూబాబాద్ సర్కిల్ చైర్మన్ సాంబమూర్తి అన్నారు. విద్యుత్ సిబ్బంది సమస్యల పరిష్కారించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి నిర్వహించే నిరవధిక సమ్మె వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కన్వీనర్ ఏడీఈ కిషోర్, కోకన్వీనర్ వెంకటేశ్వర్లు, ఏఈలు ఆరీఫుద్దీన్, మహేంద్రబాబు, సుధాకర్, రవి, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

జేపీఎస్‌లను క్రమబద్ధీకరించాలి



మహబూబాబాద్ రూరల్: సమ్మె నోటీసు అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

మహబూబాబాద్ రూరల్: పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సుందర్ కోరారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేయాలని తెలంగాణ పంచాయతీ సెక్రటరీ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సమ్మె నోటీసు అందజేశారు. ఈనెల 28 నుంచి చేపట్టబడుతున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెలో భాగస్వామ్యం అవుతామని ఆయన తెలియజేశారు.

తొర్రూరు: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని జేపీఎస్ సంఘ మండల అధ్యక్షుడు దేవయ్య కోరారు. జేపీఎస్‌లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట జేపీఎస్‌లు నిరసన తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, రాజు, ఉష, శ్రీను, మాధవి, మౌనిక, శోభ, కార్తీక్, సుధాకర్, ముక్తేశ్వర్ పాల్గొన్నారు.

పెద్దవంగర: జూనియర్ జీపీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని పంచాయతీ కార్యదర్శులు జిల్లా ప్రధాన కార్యదర్శి బిర్రు పరమేశ్ అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు మురళి, మణికుమార్, మహేష్, రవి, వీరన్న, రాజు, పావని, రజిత పాల్గొన్నారు.

కొత్తగూడ: పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ శనివారం ఎంపీడీఓ భారతికి సమ్మె నోటీసు ఇచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శులు రాజేందర్, సుమన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో వేదపండితులతో, వేదం పఠించే సాయి కుటుంబ సభ్యులచే ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1:30గంటల వరకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరుగుతుందని శ్రీషిర్డీ సాయి మందిర నిర్వాహకులు శనివారం తెలిపారు. మానుకోట జిల్లా కేంద్రంలోని శ్రీసాయి మందిరంలో శ్రీసత్యసాయి ఈశ్వర మహాలింగానికి పంచామృతాలతో అభిషేకించడం జరుగుతుందన్నారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని భగవాన్ శ్రీసత్యసాయి బాబా వారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

నిరుద్యోగులతో చెలగాటం

బయ్యారం: నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా ప్రభుత్వం వారి జీవితాలతో చెలగాటం ఆడుతుందని పీవైఎల్ రాష్ట్ర నాయకులు తుడుం వీరభద్రం అన్నారు. శనివారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, మురళీ, వెంకన్న, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పథకం నిర్వీర్యానికి కుట్ర



మాట్లాడుతున్న నాగయ్య

నెహ్రూసెంటర్: ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశం సంఘం జిల్లా అధ్యక్షుడు మండ రాజన్న అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా జి.నాగయ్య మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి పథకాన్ని రద్దు చేసే చర్యలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. పేదలందరికీ రేషన్‌షాపుల ద్వారా 16 రకాల నిత్యవసర సరుకులను అందించి ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టపర్చాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య, సహాయ కార్యదర్శి కుర్ర మహేష్, చంద్రకళ, శ్రీనివాస్, గణేష్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సహకరించాలి

- ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

మహబూబాబాద్/మహబూబాబాద్ అర్బన్: మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న పనులకు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 6, 7వ వార్డుల్లో శనివారం ఎమ్మెల్యే పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. ప్రతి వార్డుకు రూ.50లక్షలు కేటాయించడం జరిగిందని, దాంతో చాలా వరకు సమస్యలు తీరుతాయన్నారు. కార్యక్రమంలో చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, కమిషనర్ ప్రసన్నరాణి, కౌన్సిలర్ సుజాత, నాయకులు రాజు, శంకర్, శ్రీను, ఏలేందర్, శివాజీ పాల్గొన్నారు.

నిరుద్యోగులను వంచిస్తున్న ప్రభుత్వం



తొర్రూరు: హనుమకొండకు వెళ్తున్న నాయకులు

తొర్రూరు: నిరుద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం వంచిస్తుందని బీజేపీ రాష్ట్ర నాయకులు పెదగాని సోమయ్య అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం హనుమకొండలో బీజేపీ ఆధ్వర్యంలో జరిగే నిరుద్యోగ మార్చ్‌కు పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్, నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, నాయకులు రామ్మోహన్‌రెడ్డి, కుమార్, సురేష్, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవంగర: హనుమకొండ తలపెట్టి నిరుద్యోగ మార్చ్‌కు శనివారం మండలంలోని పలు గ్రామాల నుంచి బీజేపీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. వెళ్తున్న వాహనాలకు బీజేపీ రాష్ట్ర నాయకులు పాకనాటి దామోదర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుధాకర్, రవి, సోమయ్య, ఆనంద్, శంకర్, భిక్షపతి, విజేందర్, మోహన్‌దాస్, సందీప్ పాల్గొన్నారు.

మహబూబాబాద్ అర్బన్: నిరుద్యోగ మార్చ్‌కు మానుకోట జిల్లా బీజేపీ యువకులు, నాయకులు వెళ్తున్న వాహనాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రామ్‌చందర్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ధ్యామ్ సుందర్ శర్మ, అసెంబ్లీ కన్వీనర్ మోసంగి మురళి, పట్టణ నాయకులు సందీప్, యశ్వంత్, సందీప్, ప్రేమ్‌కుమార్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఇందుభారతి పాల్గొన్నారు.

వర్చువల్ ఐడీతో వాటాధనం జమ చేయాలి

బయ్యారం: గొర్రెల పంపిణీ నిమిత్తం లబ్ధిదారులు తమ గ్రామ సొసైటీలలో కేటాయించబడిన వర్చువల్ ఐడీ ద్వారా తమ వాటాధనంను ఖాతాలో జమ చేయాలని బయ్యారం పశువైద్యాధికారిణి ఇందిరా ప్రియదర్శిణి అన్నారు. శనివారం మండలంలోని గౌరారంలో లబ్ధిదారులతో ఆమె మాట్లాడారు. ప్రతి లబ్ధిదారుడు తమ వాటాధనంగా రూ.43,750 బ్యాంకుల్లో వర్చువల్ ఐడీ ఆధారంగా కలెక్టర్ ఖాతాకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. త్వరలో లబ్ధిదారులందరికి వర్చువల్ ఐడీ నంబర్‌ను సొసైటీ అధ్యక్షుల ద్వారా అందజేస్తామన్నారు. సమావేశంలో సర్పంచ్ చింత వెంకన్న, సొసైటీ అధ్యక్షుడు రామారావు, తిరుమలేష్, వెంకన్న, మోహన్‌రావు, వెంకన్న పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీపై అవగాహన

కేసముద్రం: మండలంలోని ధన్నసరి గ్రామంలో శనివారం రెండో విడత గొర్రెల పంపిణీపై లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈమేరకు వెటర్నరీ వైద్యుడు విజయ్‌కుమార్ లబ్ధిదారులకు పలుసూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండ్రెడ్డి శ్రీవాణి, రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ దారావత్ బాలునాయక్, ఉపసర్పంచ్ బానోత్ వెంకన్న, గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం సొసైటీ అధ్యక్షుడు అమ్మనగంటి రాజు, ప్రధాన కార్యదర్శి తండా మహేష్, తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం వరి విత్తనాలతో మోసం



వరి పంటలు పరిశీలిస్తున్న కేవీకే శాస్త్ర వేత్త మాలతి, ఏఓ వీరసింగ్

మరిపెడ రూరల్: నాసిరకం వరి విత్తనాలో దిగుబడి లేక మోసం పోయామని మరిపెడ మండలం తానంచర్ల రెవెన్యూ పరిధిలోని అజ్మీరతండా, ఆనకట్ట తండాల గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు బాధిత రైతుల ద్వారా విషయం తెలుసుకున్న కేవీకే మల్యాల శాస్త్రవేత్త మాలతి, మరిపెడ వ్యవసాయ అధికారి బి.వీరసింగ్ శనివారం బాధిత గిరిజన రైతులతో కలిసి వరి పంట క్షేత్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా బాధిత గిరిజన రైతులు అధికారుల ఎదుట తమ గోడును వెల్లబోసుకున్నారు. దంతాలపల్లి మండల కేంద్రంలోని ఓ షాపు నుంచి కేఎస్‌ఎం 118 అనే వరి విత్తనాలు కొనుగోలు చేసి సుమారు 250 ఎకరాల్లో సాగు చేశామన్నారు. ఇందుకు ఎకరానికి రూ.25వేలు పెట్టుబడితో సాగు చేపట్టామన్నారు. తీర చేతికి అందొచ్చిన వరి పంట మొత్తం సగానికి పైగా తాలుగింజలు అయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నాసిరకం విత్తనాలతో తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు అధికారులను వేడుకున్నారు. అనంతరం వరి పంట పరిశీలించిన అధికారులు కాండం తొలిచే పురుగు ఉధృతి అధికం కావడం తోపాటు సరియైన సమయంలో సస్యరక్షణ చర్యలు చేపట్టకపోవడం కూడా వరి పంట తాలుకావడానికి, పంట దిగుబడి తగ్గడానికి కారణం కావచ్చన్నారు. పూర్తి స్థాయి వరి పంటలను పరిశీలన చేసి నిజనిర్ధారణ చేయనున్నట్లు అధికారులు బాధిత రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బాధిత రైతులు అజ్మీర బిచ్చు, భద్రు, కిషన్, మంగ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు రంజాన్ కానుకల పంపిణీ

చిన్నగూడూరు: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నిరుపేద ముస్లింలకు నేడు రంజాన్ గిఫ్ట్‌ల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే రెడ్యానాయక్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

మత్స్య సహకార సంఘం ఎన్నిక



తొర్రూరు రూరల్: మండలంలోని చింతలపల్లి గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్ యాకుబ్‌అలీ, మండల ముదిరాజ్ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కొత్తూరు రమేష్, చంద్రమూర్తి శనివారం తెలిపారు. అధ్యక్షుడిగా కుంట దేవేందర్, ఉపాధ్యక్షుడిగా కుంట రవి, కార్యదర్శిగా కుంట వాసు, కార్యవర్గ సభ్యులుగా యాకన్న, రమేష్, యాకయ్య, సాయిలు, సంతోష్, సంపత్ ఎన్నికయ్యారు.

విజయవంతం చేయాలి

మరిపెడ రూరల్: పెన్షన్ కాన్సిట్యూషన్ మార్చ్ ర్యాలీని విజయవంతం చేయాలని తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూషనరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి లింగాల మహేష్‌గౌడ్, మరిపెడ మండల శాఖ అధ్యక్షుడు దోమల లింగయ్య అన్నారు. శనివారం గాలివారి గూడెంలో మాట్లాడుతూ.. నేడు ఉదయం 10:30 గంటలకు జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

సభ్యులకు ఆహ్వానం కరువు

దంతాలపల్లి: హైదరాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం నాయకులకు ఆహ్వానం కరువైందని సంఘం నాయకుడు ధర్మారపు పవన్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడారు. నిరంతరం దళితుల సమస్యల కోసం పోరాడుతున్న సంఘం నాయకులను పిలువకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి దైద వెంకన్న, నెమ్మది వెంకన్న, సురేందర్, సుమన్ పాల్గొన్నారు.

రోగులకు పాలు, పండ్లు పంపిణీ

గార్ల: ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ భర్త, ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ హరిసింగ్ నాయక్ జన్మదినం సందర్భంగా స్థానిక సీహెచ్‌సీ ఆస్పత్రిలో కట్ చేసి రోగులకు మిఠాయిలు, పాలు పండ్లు, రొట్టెలను ఎంపీపీ శివాజీనాయక్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, సర్పంచ్ అజ్మీర బన్సీలాల్, ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, సర్పంచ్‌లు ధరావత్ సక్రు, శంకర్, శ్రీను, మురళి, తదితరులు పాల్గొన్నారు.

దంత పరిరక్షణపై అవగాహన



గూడూరు: ప్రతీ రోజు ఉదయం లేవగానే ముందుగా దంతాలను శుభ్రం చేసుకోవాలని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ వీరన్న, దంత వైద్యుడు భరత్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చిన్నారులకు దంత పరిరక్షణ, ఆరోగ్య పరిస్థితులపై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు ఉచితంగా టూత్ పేస్టులు, బ్రష్‌లతో పాటు బిస్కట్ ప్యాకెట్‌లు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కత్తి స్వామి, ఉపాధ్యాయుడు బత్తుల శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్ మంగమ్మ పాల్గొన్నారు.

సన్మానం

మహబూబాబాద్ అర్బన్: హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో శనివారం నిర్వహించిన సెర్ప్ ఆత్మీయ సమ్మేళనంలో డీఆర్డీఏ జిల్లా అధికారి ఆర్.సన్యాసయ్యను సన్మానించి సత్కరించారు.

క్రైం కార్నర్..

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

దంతాలపల్లి: అడవి పందులతో వెళ్తున్న వాహనం ఆటోను ఢీకొట్టగా ముగ్గురికి గాయాలైన సంఘటన శనివారం సాయంత్రం మండలంలోని బొడ్లాడ క్రాస్ రోడ్డు వద్ద చోటు చేసుకుంది. మరిపెడ నుంచి తొర్రూరు వైపు ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను అడవి పందులతో వెళ్తున్న ఆశోక లేలాండ్ వాహనం బొడ్లాడ క్రాస్ రోడ్డు వద్ద ఢీకొట్టింది. ఆటోలో వెళ్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. అడవి పందులతో దొరికిన వాహనాన్ని అటవీ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై జగదీష్ తెలిపారు.

ఆధ్యాత్మిక గురువు మృతి

పెద్దవంగర: మండలంలోని ఉప్పరగూడెం గ్రామంలోని బ్రహ్మం గారి ఆశ్రమంలో ఉంటున్న ఆధ్యాత్మిక గురువు సదానంద యోగి (94) వయోభారంతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు.

వరిగడ్డి దగ్ధం

డోర్నకల్: తండాకు చెందిన రైతు భూక్యా సక్రాం 22ఎకరాల వరిగడ్డి శనివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. సర్పంచ్ పాండునాయక్ ఫైరింజన్‌కు సమాచారం అందించగా ఫైరంజన్‌తో సిబ్బంది చేరుకొని మంటలను ఆర్పారు. ప్రమాదంలో లక్షల రూపాయల విలువైన గడ్డి ధ్వంసమైట్లు బాధిత రైతు సక్రాం తెలిపారు.

దొంగ అరెస్ట్

నెల్లికుదురు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దొంగతనం చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపారు. శనివారం ఎస్సై మాట్లాడుతూ.. గత నెల 21న పీహెచ్‌సీలో దొంగతనం చేసిన మహబూబాబాద్‌కు చెందిన గాదె శివ సాయిని పట్టుకుని కేసు నమోదు చేసి అతని వద్ద 2 ఇన్వర్టర్ బ్యాటరీలు, 1ల్యాప్‌ట్యాప్, ఎల్‌జీ టీవీని రికవరీ చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నెల్లికుదురు: మండల కేంద్రంలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్న రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గునిగంటి రాజన్న ఆగ్రహం వ్యక్తం చేశాడు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని తహసీల్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ యోగేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పెరుమాండ్ల తిలక్ బాబు, నాయకులు పెరుమాండ్ల బాబు గౌడ్ ఇస్సంపల్లి సైదులు, పుల్లయ్య, నర్సయ్య, ఎల్లయ్య, యాకయ్య, భిక్షపతి, పాషా, వీరెంకులు పాల్గొన్నారు.